క్లుప్తంగా

నేడు మంత్రి సమీక్ష

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మ. ధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని గోళ్ల పంచాయతీలోని గోళ్ల, శీబావి, పాతచెరువు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులతో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, డీలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరు కావాలన్నారు.

పంపిణీకి సిద్ధంగా 'జగనన్న విద్యాకానుక'



రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏఎంఓ హరికృష్ణ

కూడేరు: పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్ఎంలు, సీఆర్పీలకు సర్వ సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) జిల్లా అసిస్టెంట్ మానటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) హరికృష్ణ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని గొటుకూరు ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లు, రాగి జావను పాఠశాలకు తెచ్చుకున్నారా అని ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మార్సీని సందర్శించారు. పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు సరఫరా చేశారా? అని సిబ్బందితో ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అధికారి మాధవరెడ్డి, ఉపాధ్యాయుడు అడవి రాజు, సీఆర్పీ ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీసేవ



పెన్నహోబిలంలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఈఓ కె.విజయ్‌కుమార్, అర్చకుల ఆధ్వర్యంలో పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని అలంకరించిన పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యాక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మత్స్యకారుల కాలనీలో వైద్య శిబిరం



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ చంద్రమనోహర్

కణేకల్లు: పట్టణంలోని మత్స్యకారుల కాలనీలో వైద్యాధికారులు శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీలో పలువురు అతిసారాతో బాధపడుతుండటంతో వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు స్పందించారు. డాక్టర్ విజయకుమార్, చంద్రమనోహర్, హెల్త్ అసిస్టెంట్ శివశంకర్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అతిసారం లక్షణాలున్న వారికి వైద్యసేవలందించారు. అలాగే ఈఓఆర్డీ గూడెన్న, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ వీధులను శుభ్రం చేయించారు. అతిసారం ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. ఏఎన్ఎం భారతి, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఆశ వర్కర్ రాధ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

కళ్యాణదుర్గం: పట్టణంలోని పార్వతీనగర్‌లో నివాసముంటున్న మల్లికార్జున అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. తలుపు వద్ద శబ్దం వస్తుండటంతో ఇంటి పైభాగంలో నిద్రిస్తున్న యజమాని కేకలు వేయగా దుండగులు పారిపోయారు. దుండగులు తాళం పగులకొట్టేందుకు వినియోగించిన ఇనుప రాడ్ సైతం అక్కడే వదిలేసి వెళ్లినట్లు యజమాని తెలిపారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు



గాయపడిన రమేష్



మహేష్

కళ్యాణదుర్గం: దురదకుంట గ్రామ సమీపంలో శనివారం బైకు బోల్తా పడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. కంబదూరు మండలం గొల్లపల్లికి చెందిన మహేష్, కర్ణాటకకు చెందిన బంధువు రమేష్‌తో కలిసి కళ్యాణదుర్గం మండలం దురదకుంటకు వస్తున్నారు. గ్రామ సమీపంలోకి రాగానే బైకు బోల్తా పడింది. ఘటనలో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సొంతింటి కల సాకారం



బీటీపీ రోడ్డులో గృహ ప్రవేశం పూర్తయిన ఇల్లు



గౌడ లేఅవుట్‌లో అందంగా నిర్మించుకున్న ఇల్లు

- జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు
- రాయదుర్గం అర్బన్‌లో పూర్తయిన 940 గృహాలు

రాయదుర్గంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సొంతింటి కల సాకరమవుతోంది. గత టీడీపీ పాలనలో పేదలు పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్థలం, ఇల్లు మంజూరు కాక, ఆర్థిక స్తోమత లేక అవస్థలు పడి బాడుగ ఇళ్లలో బతుకీడ్చారు. ఇలాంటి పేదలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక చేయూత అందజేశారు. ఇబ్బందులు లేకుండా అవసరమైన మెటీరియల్ సైతం అందజేస్తున్నారు. అంతేకాక సబ్సిడీతో సిమెంట్, ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తూ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా అన్ని వసతులు (నీరు, విద్యుత్ సౌకర్యం) కల్పించారు. ఈ క్రమంలో రాయదుర్గం పట్టణంలో ఏర్పాటు చేసిన 14 జగనన్న కాలనీల్లో 2,379 మందికి ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేశారు. ఓ యజ్ఞంలా ఇంటి నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటి దాకా 940 ఇంటి నిర్మాణాలు పూర్తి కాగా మరో 200లకుపైగా ఇళ్లు టాప్ పూర్తవగా మిగితావి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఎంతో ఆకర్షణీయంగా, అద్భుతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని కొందరు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండగా కొన్ని కాలనీల్లో కొందరు కలల సౌధంలో ప్రవేశాలు కూడా చేసుకున్నారు. సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్ పది కాలాల పాటు చల్లగా ఉండాలని ఆశీర్వదిస్తున్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం



దాదాపు 15 ఏళ్లు అద్దె ఇళ్లలో కాలం వెల్లదీశాం. భర్త శ్రీనివాసులు బొరుగుల బట్టీలో కార్మికుడిగా పనిచేస్తుండగా నేను గార్మెంట్స్ కార్మికురాలిగా పని చేస్తున్నా. టీడీపీ హయాంలో పదిసార్లు అర్జీ ఇచ్చినా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం జగనన్న మా సొంతింటి కల నెరవేర్చారు ఇంటి స్థలం, రుణం మంజూరు కావడంతో బీటీపీ లేఅవుట్‌లో ఇంటిని నిర్మించుకుని గృహ ప్రవేశం చేశాం. సీఎం జగన్‌కు అండగా ఉంటాం. – కళావతి, గార్మెంట్స్ కార్మికురాలు, రాయదుర్గం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం' లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పూలకుంట, గొనికుంట, గుమ్మఘట్టలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రామం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంత లబ్ధి పొందారో వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులందరికీ ఏలాంటి రాజకీయ సిఫారస్సులు లేకుండా , కార్యాలయాలు, నాయకులు చుట్టూ తిరగకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా అందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలనూ ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తారన్నారు. టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజల్లో అభాసుపాలవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొని కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంటాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్బీ కాంతారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు సిరిగె జయమ్మ, రామకృష్ణారెడ్డి, బేలోడు సర్పంచ్ కోట్ల ఉమేష్, ఎంపీటీసీ గోవింద, హనుమన్న, రామప్ప, మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, వైస్ సర్పంచ్ నగేష్, బేలోడు రామాంజనేయులు, ఖాజాహుస్సేన్, కె.ఎం. రాజు, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా వాటర్‌షెడ్ నిధుల చెల్లింపు



విజయవాడలో వాటర్‌షెడ్ డైరెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: 2019 నుంచి వాటర్‌షెడ్ ఫారంపాండ్స్ కింద రైతులు పొలాల్లో చేసుకున్న పెండింగ్ నిధులను వారంలోగా విడుదల చేస్తామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి రాష్ట్ర వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పీ.వీఆర్ఎం రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం విజయవాడలోని వాటర్‌షెడ్ డైరెక్టర్‌తో ఎమ్మెల్సీ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో వాటర్‌షెడ్ ద్వారా పొలాల్లో ఫారంపాండ్ పనులు రైతులు చేసుకున్నారని, ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు కాలేదన్నారు.వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో వాటర్‌షెడ్ సంబంధిత పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ కోరారు. కల్యాణ మండపాలకు నిధులు కేటాయించండి ఉరవకొండలోని వాల్మీకి కల్యాణ మండపం శిథిలావస్థలో ఉందని, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శులు పూనం మాలకొండయ్య, ధనంజయరెడ్డిని ఎమ్మెల్సీ కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు.

రూ.80 లక్షలతో అదనపు తరగతి గదులు



నిర్మాణంలో ఉన్న అదనపు గదులు

కూడేరు: 'నాడు–నేడు'తో కూడేరు హైస్కూల్ రూపురేఖలే మారనున్నాయి. హైస్కూల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు తీసుకువచ్చారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన ఉండాలని ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీతో పిల్లల సంఖ్య ఏడాది ఏడాదికి పెరుగుతూ వస్తోంది. దీంతో నాడు –నేడు కార్యక్రమం కింద 10 అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. నిర్మాణపు పనులు వేగంగా సాగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయితే పిల్లలకు ఎలాంటి అసౌకర్యం ఉండదు.

భక్తిశ్రద్ధలతో రోషన్ షా వలి ఉరుసు



అలంకరణలో రోషన్ షా వలి పీర్ల మకానం



కొండపై భక్తుల సందడి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలోని వన్నూరు స్వామి కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జలాలి రోషన్ షా వలి ఉరుసు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 8న ప్రారంభమైన ఉత్సవాలు ఉరుసు కార్యక్రమంతో శుక్రవారం ముగిశాయి. అంతకుముందు ఉదయం భక్తులు కొండపై రోషన్‌షా వలిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొండ సమీపంలో గాజులు, బొమ్మల అంగళ్లు, తినుబండారాల దుకాణాలతో పండుగ వాతావరణ నెలకొంది. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ప్రైవేటు బస్సు ఏజెంట్ల అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రైవేటు బస్సు ఏజెంట్ అసోసియేషన్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చమ్మా అస్లాం, ఉపాధ్యక్షుడిగా వెంకటపతిరాజు, కార్యదర్శిగా అహ్మద్ హుస్సేన్, సహాయ కార్యదర్శిగా గొల్ల వెంకటేశులు, కోశాధికారిగా మహమ్మద్ ఫారుక్, సభ్యులుగా శ్రీకాంత్, మారేష్, మహమ్మద్, ఓబన్న, కుమార్‌స్వామి, నాగరాజు ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

శిథిలావస్థకు చేరిన రోడ్డుకు మోక్షం



బీఎన్‌హళ్లి క్రాస్ నుంచి నేత్రపల్లి గ్రామానికి వేసిన తారు రోడ్డు

గుమ్మఘట్ట: శిథిలావస్థకు చేరుకున్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని బీఎన్‌హళ్లి క్రాస్ నుంచి నేత్రపల్లి వరకూ వెళ్లే రహదారి అధ్వానంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తారురోడ్డు నిర్మిస్తామని గత పాలకులు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారు. రహదారి గుంతలు పడి వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు అనేక ఇబ్బందులు పడేవారు. సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి సమస్యను వివరించి రహదారి నిర్మాణానికి రూ.31 లక్షల ఎంఎంసీ నిధులను మంజూరు చేయించారు. రహదారి రూపురేఖలు మారడంతో నేత్రపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు

కళ్యాణదుర్గం రూరల్: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని దురదకుంటలో శనివారం ఆర్డీటీ నిర్మించిన 40 ఇళ్లను స్పెయిన్ దేశస్తుల బృందం ప్రారంభించింది. ప్రతి ఒక్కరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి, స్థానిక నాయకులు, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశారు

వజ్రకరూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించ డంతోపాటు సీపీఎస్‌ను రద్దుచేస్తూ మంత్రివర్గం ఆమోదించడం శుభ పరిణామమన్నారు. సీఎం శ్రీకారం చుట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముగింటకే పథకాలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ వన్నల్లి రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ఆదేశాల మేరకు ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, నాయకులు రామకృష్ణ, మనోహర్‌శెట్టి, ఆనంద్ రెడ్డి, వన్నూరుస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

శెట్టూరు: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ నాగలింగేశ్వర రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. పశువులు చనిపోతే రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వైఎస్సార్ పశువుల బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి బీమా చేయించుకోవాలన్నారు. సంకర జాతి ఆవు, ఎద్దు మరణిస్తే రూ. 30 వేలు, దేశవాళి జాతి పశువులకైతే రూ.15 వేల వరకూ పరిహారం అందుతుందన్నారు. ఆరు నెలల వయస్సున్న గొర్రెలు, మేకలు, పందులు మరణిస్తే రూ. 6 వేలు అందిస్తామన్నారు. కాగా చింతర్లపల్లిలో పశువులకు వెటర్నరీ అసిస్టెంట్ ఏ హెచ్ ఎర్రిస్వామి తదితరులు పశు బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప గ్రామంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తరలివచ్చి హాజరు కావాలని ఆయన కోరారు.

వజ్రకరూరులో మోస్తరు వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. పదును వర్షం రావడంతో అన్నదాతలు వ్యవసాయ పనులు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సేంద్రియ వ్యవసాయం శ్రేయస్కరం

కుందుర్పి: ఖరీఫ్ పంటల సాగులో రైతులు సేంద్రియ పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట సాగుకు ముసుపు భూములను వాలుకు అడ్డంగా దున్ని సేంద్రియ ఎరువులు వేయాలన్నారు. అలాగే రాత్రి పూట మంటలు వేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 3,200 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. వారం రోజుల్లో బహుళ పంటల సాగు కోసం రైతులకు సబ్సిడీతో రాగులు, కొర్రలు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యాభివృద్ధికి సీఎం పెద్దపీట



ఎంబీబీఎస్ సీటు సాధించిన వర్షిణిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక బళ్లారి బైపాస్‌లోని యాదవ సంఘ కల్యాణ మండపంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పద్మశాలి కులస్తుల పిల్లలకు పద్మశ్రీ ప్రతిభ పురస్కారాలు అందచేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యంగా నాడు–నేడు కింద కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చివేసిందన్నారు. పంచాయతీ ద్వారా 20 సెంట్ల స్థలాన్ని భద్రావతి, భావనరుషేంద్రుల ఆలయం, కల్యాణ మండపానికి మంజూరు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పట్టాను ఎంపీపీ చంద్రమ్మ, సర్పంచ్ మీనుగ లలితమ్మ, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు చేతుల మీదుగా పద్మశాలి సంఘానికి అందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన టెన్త్, ఇంటర్ విద్యార్థులతో పాటు ఎంబీబీఎస్ సీటు సాధించిన నాగమల్లి వర్షిణిను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు పెనగొండ్ల వెంకటేసు, తిరువిధుల వెంకటేసు, నాగమల్లి నగేష్, నాగమల్లి నారాయణస్వామి, కాసుల ఆంజనేయప్రసాద్, కాసుల శ్రీధర్, సుదర్శన్, కృష్ణమూర్తి, బాలు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వార్డు సభ్యుడు మల్లి పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



నేమకల్లు ఆంజనేయస్వామి



జనార్ధన వేంకటేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జనార్ధన వేంకటేశ్వరస్వామికి..

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్ధన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి చేపట్టారు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఈకార్యక్రమంలోఅర్చకులు న రసింహామూర్తి,భక్తులు తదితరులు పాల్గొన్నారు.